@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || శనివారం 29, మార్చి 2025 || పేజీలు: 04

# భూ విలయం

## మయన్మార్ థాయ్‌లాండ్‌లో భారీ భూకంపం..

### 191 మంది మృతి.. 800 మందికి గాయాలు

- రిక్టర్ స్కేలుపై 7.7 తీవ్రత నమోదు
- 12 నిమిషాల్లో 6.4 తీవ్రతతో మరో భూకంపం
- తర్వాత మరో 4 సార్లు ప్రకంపనలు
- శిథిలాల్లో వందల మంది ఆచూకీ గల్లంతు
- థాయ్‌లాండ్, నైరుతి చైనాల్లో భారీగా ఆస్తి నష్టం
- భారత్, బంగ్లాదేశ్‌ల్లోనూ ప్రకంపనలు
- థాయ్‌లాండ్, మయన్మార్‌లలో అత్యవసర పరిస్థితి
- అన్నివిధాలా ఆదుకుంటాం: ప్రధాని నరేంద్ర మోదీ



బ్యాంకాక్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 28:

అతి భారీ భూకంపం మయన్మార్‌ను కుదిపేసింది. రాజధాని నేపిడో, రెండో అతిపెద్ద నగరం మాండలేలలో భారీ ప్రాణనష్టం, తీవ్ర ఆస్తినష్టం సంభవించింది. ప్రఖ్యాత కట్టడాలు, పురాతన ఆలయాలు, ఆస్పత్రులు కూలిపోయాయి. 181 మంది మరణించి ఉంటారని అంచనా. మరో 730 మంది గాయపడ్డారని చెబుతున్నారు. వందల మంది జాడ తెలియడం లేదు. దాంతో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. శుక్రవారం మధ్యాహ్నం 12.50 గంటలకు(భారత కాలమానం ప్రకారం 11.50) రిక్టర్ స్కేల్‌పై 7.7 తీవ్రతతో తొలుత ఒక భూకంపం వచ్చింది. తిరిగి పన్నెండు నిమిషాల వ్యవధిలో 6.4 తీవ్రతతో మరో భూకంపం వచ్చింది. తర్వాత మరోనాలుగుసార్లు ప్రకంపనలు వచ్చాయి. రెండోసారి వచ్చిన భూకంపం మయన్మార్‌నే కాకుండా పొరుగున ఉన్న థాయ్‌లాండ్, చైనాలోనూ విధ్వంసం సృష్టించింది. థాయ్‌లాండ్‌లో పది మందికి పైగా మరణించారని, డజన్ల సంఖ్యలో గాయపడ్డారని అధికార వర్గాలు తెలిపాయి. చైనా వివరాలు అసలు బయటకే రాలేదు. అయితే, మూడు దేశాల్లో కలిపి ప్రాణనష్టం శనివారం నాటికి భారీగా పెరగొచ్చని అనుమానిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు శిథిలాల్లో చిక్కుకొని ఉంటారని భావిస్తున్నారు. ముఖ్యంగా బహుళ అంతస్తులకు నిలయమైన థాయ్‌లాండ్ రాజధాని, ప్రముఖ పర్యాటక కేంద్రం బ్యాంకాక్‌లో పలు భవనాలు పేక మేడల్లా కూలిపోయాయి. నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవనం నిలువునా (మిగతా 2లో..)



## మయన్మార్, థాయ్‌లాండ్‌కు మోదీ అండ

మయన్మార్, థాయ్‌లాండ్ భూకంపాలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. రెండు దేశాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం తన ట్విటర్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో .. ' భూకంపం కారణంగా మయన్మార్, థాయ్‌లాండ్ దేశాల్లో ఏర్పడ్డ పరిస్థితులను చూస్తుంటే బాధగా ఉంది. అక్కడి వారందరూ క్షేమంగా ఉండాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నాను. భారత్ మీకు అండగా ఉంటుంది. అవసరమైన సాయం చేస్తుంది. మా అధికారులకు కూడా ఆదేశాలు ఇచ్చాను. మయన్మార్, థాయ్‌లాండ్ ప్రభుత్వాలతో టచ్‌లో ఉండమని మా విదేశీ వ్యవహారాల శాఖకు కూడా చెప్పాను' అని అన్నారు.




## అత్యంత శక్తిమంతమైన భారతీయుల జాబితాలో రేవంత్‌రెడ్డి

- ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జాబితా-2025లో నిరుటితో పోలిస్తే 11 స్థానాలు పైకి చేరుకున్న ముఖ్యమంత్రి
- విధానపరమైన కీలక నిర్ణయాలతోనే గుర్తింపు!
- అగ్రస్థానంలో ప్రధాని నరేంద్ర మోదీ.. 9వ స్థానంలో రాహుల్
- ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుకు 14వ స్థానం

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 28:

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశంలోని అత్యంత శక్తిమంతమైన వ్యక్తుల జాబితాలో తన స్థానాన్ని మెరుగుపర్చుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి ఏకంగా 11 స్థానాలు ఎగబాకారు. దేశంలోని వివిధ రంగాల్లో అత్యంత శక్తిమంతులైన 100 మంది ప్రముఖులతో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్-2025' జాబితాను విడుదల చేసింది. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డికి 28వ స్థానం దక్కింది. గత ఏడాది ఈ జాబితాలో ఆయన 39వ స్థానంలో నిలిచారు. జాబితాలో ప్రధాని నరేంద్ర మోదీ అగ్రస్థానంలో నిలిచారు. నిరుడూ ఆయన నంబర్ వన్‌గానే ఉన్నారు. రెండో స్థానంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, మూడో స్థానంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ నిలిచారు. తర్వాత (పది స్థానాల్లో) వరసగా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అశ్వినీ వైష్ణవ్, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ ఉన్నారు. 100 మంది జాబితాలో దేశంలోని రాజకీయ, వ్యాపార, క్రీడా, వినోద రంగాల్లో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్ర భుత్వం ఏర్పాటైన తర్వాత పాలనలో తీసుకొచ్చిన మార్పులు, వ్యూహాత్మక రాజకీయ కార్యకలాపాలతో (మిగతా 2లో..)



## పాలమూరు-రంగారెడ్డికి జాతీయ ప్రతిపాదన

- తిరస్కరిస్తూ తిప్పి పంపిన కేంద్రం 2

## పరువు హత్య

- తన కూతుర్ని ప్రేమిస్తున్నాడని యువకుడిని గొడ్డలితో నరికి చంపిన తండ్రి.. పెద్దపల్లిలో దారుణం
- యువకుడికి కూతురు బర్త్ డే విషెస్ చెప్పడం, అతడితో కేక్ కట్ చేయించడంతో ఆగ్రహం
- మధ్యాహ్నం నుంచి యువకుడి కదలికలపై దృష్టి
- రాత్రి మిత్రులతో కలిసి మద్యం తాగుతుండగా దాడి
- చంపేస్తారేమోనని గతంలోనే హెచ్చరించిన యువతి
- గతంలోనూ రెండుసార్లు యువకుడిపై దాడికి యత్నం! 2





## కేంద్ర ఉద్యోగులకు శుభవార్త

- డీఏ 2% పెంపు పెన్షనర్లకు డీఆర్ కూడా.. కేంద్ర క్యాబినెట్ నిర్ణయం
- ఖరీఫ్‌లో ఫాస్ఫేట్, పొటాష్ ఎరువులపై రూ.37,216 కోట్ల సబ్సిడీ
- నాన్-సెమీకండక్టర్ పరికరాల కోసం 22,919 కోట్లతో పీఎల్ఐ స్కీం

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 28:

కేంద్ర మంత్రివర్గం కేంద్ర ప్రభుత్వోద్యోగులకు, పెన్షనర్లకు శుభవార్త ప్రకటించింది. వారికి కరువు భత్యం (డీఏ), డిఏఫ్‌లను రెండు శాతం పెంచే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన శుక్రవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ దీనితో పాటు మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుందని రైల్వే, సమాచార,ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగులు, పెన్షనర్ల మౌలిక వేతనం/పింఛనులో డీఏ, డీఆర్ 53 శాతంగా ఉన్నాయని.. ఇప్పుడవి 55 శాతానికి పెరిగినట్లు చెప్పారు. ఏడో వేతన సంఘం సిఫారసుల ఆధారంగా.. ధరల పెరుగుదలను పరిగణనలోకి తీసుకుని మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి పెంపు అమల్లోకి వస్తుంది. దీనివల్ల 48.66 లక్షల మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులు, 66.55 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందుతారని తెలిపారు. ఎనిమిదో వేతన కమిషన్ ఏర్పాటుకోసం ఎదురుచూస్తున్న వీరికి ఇప్పుడు వేతనాలు, పెన్షన్లు పెరుగుతాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే ఈ పెంపు కారణంగా కేంద్ర ఖజానాపై ఏటా రూ.6,614.04 కోట్ల భారం పడుతుందని మంత్రి చెప్పారు. కాగా.. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఫాస్ఫేట్, పొటాషియం ఎరువులపై రూ.37,216 కోట్ల సబ్సిడీ ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. డీఏపీ ఎరువుల ప్రస్తుత రిటైల్ ధరలు యథాతథంగా కొనసాగుతాయి. రూ.22,919 కోట్లతో నాన్-సెమీకండక్టర్ ఎలక్ట్రానిక్స్ పరికరాలకు ఉత్పాదక ఆధారిత రాయితీ (పీఎల్ఐ) స్కీంను కూడా (మిగతా 2లో..)

## విషాదం

- అనుమానాస్పద స్థితిలో ముగ్గురు చిన్నారుల మృతి
- మరో ఘటనలో బావిలో పడి ఇద్దరు కార్మికుల దుర్మరణం
- సంగారెడ్డి జిల్లాలో ఘటనలు

సంగారెడ్డి, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 28:

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో విషాదం చోటుచేసుకుంది. ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారులు అనుమానాస్పద రీతిలో మృతిచెందారు. అలాగే ఇద్దరు వలసకార్మికులు అనుమానాస్పద స్థితిలో బావిలో పడి చనిపోయారు. ఈ సంఘటన కోహీర్ మండలం పైడిగుమ్మల్ లో విషాదం చోటు చేసుకుంది. ఇకపోతే పిల్లల మృతి ఘటనలో వారి తల్లి రజిత తీవ్రమైన కడుపునొప్పితో స్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. అనుమానాస్పదంగా ముగ్గురు చిన్నారులు మృతి చెందడంతో స్థానికులు కంటతడిపెట్టారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో చెన్నయ్య, ఆయన భార్య రజిత తమ ముగ్గురు పిల్లలు సాయికృష్ణ (12), మధుప్రియ (10), గౌతమ్ (8)తో కలిసి నివాసముంటున్నారు. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో భార్యాభర్తలతో పాటు ముగ్గురు పిల్లలు (మిగతా 2లో..)



# భూ విలయం



(మొదటి పేజీ తరువాయి..)

కూలిపోయిన దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను నిరుత్తరులను చేశాయి. అంతపెద్ద భవనం క్షణాల్లో సిమెంటు రాళ్లు, ఇనుప తీగలకుప్పగా మారింది. ఈ ఒక్క భవనంలోనే 43 మంది నిర్మాణ కార్మికులు చిక్కుకున్నారని అంటున్నారు. శిథిలాల్లో చిక్కుకుపోయిన వారి ఆర్తనాదాల వీడియోలు సోషల్ మీడియాలో తిరుగుతున్నాయి. మయన్మార్, థాయ్‌లాండ్ రెండు దేశాల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. భూకంప కేంద్రం ఉన్న మయన్మార్‌లో పరిస్థితి తీవ్రంగానే ఉంది. ఐరావతి నది మీద మాండలే నగరంలో 90 ఏళ్ల క్రితం కట్టిన ప్రఖ్యాత అవా వంతెన కుప్పకూలిపోయింది. దాంతో మాండలేకు, మయన్మార్ అతిపెద్ద నగరం యాంగూన్‌కు మధ్య రాకపోకలు దెబ్బతిన్నాయి. మాండలేలో బహుళ అంతస్తుల భవనం వంగిపోవడంతో పైభాగాన స్విమ్మింగ్‌పూల్ నుంచి నీరంతా జలపాతంలా దూకే దృశ్యాలను ప్రజలు చిత్రీకరించారు.

మయన్మార్ రాజధాని నేపీటాలో వెయ్యి పడకల ఆసుపత్రి కూలిపోయి 20 మంది మరణించారు. మాండలే నగరంలోని మాండలే రాజప్రాసాదం, బౌద్ధ క్షేత్రం మహాముని పగోడా పునాదులు దెబ్బతిన్నాయి. ఎవరు సాయం ఇచ్చినా స్వీకరిస్తామని మయన్మార్ ప్రభుత్వం ప్రకటించింది. బ్యాంకాక్ నగరంలో పలు హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లు ముందుజాగ్రత్తగా మూసేశారు. ప్రభుత్వం కూడా పర్యాటకులు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లొద్దని సూచించింది. బ్యాంకాక్‌ను ప్రభుత్వం విపత్తు ప్రాంతంగా ప్రకటించింది. తెలుగువారు ఎక్కువగా వెళ్లే పట్టాయా భూకంప కేంద్రానికి దూరంగా ఉండటంతో అక్కడ పెద్దగా ప్రభావం లేదు. అయితే, మరిన్ని ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. భూకంపం కారణంగా థాయ్‌లాండ్‌లో విమానాశ్రయాలు మూసేయడంతో హైదరాబాద్ విమానాశ్రయానికి వచ్చే పలు విమానాలు రద్దు అయ్యాయి. ఆ విమానాల్లో ప్రయాణించాల్సిన ప్రయాణికులు సాయంత్రం నుంచి శంషాబాద్ విమానాశ్రయంలో ఎదురు చూస్తున్నారు. భూకంప కేంద్రం ఉపరితలానికి కేవలం పది కిలోమీటర్ల లోతులో ఉండటం వల్ల నష్టం తీవ్రత అధికంగా ఉందని భావిస్తున్నారు. భూకంపం నేపథ్యంలో థాయ్‌లాండ్ స్టాక్ ఎక్స్ఛేంజీని నిలిపేశారు. కోల్‌కతాలోనూ ప్రకంపనలు భూప్రకంపనలు భారత్ వరకు విస్తరించాయి. కోల్‌కతా, ఇంపాల్‌లో భవనాలు కంపించాయి. భూకంపం నష్టంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. రెండు దేశాలకు ఎలాంటి సాయం అవసరమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. మయన్మార్, థాయ్‌లాండ్ ప్రభుత్వాలతో భారత విదేశాంగ శాఖ టచ్‌లో ఉందని చెప్పారు. బంగ్లాదేశ్‌లో 7.3 తీవ్రతతో భూకంపం వచ్చింది. రాజధాని ఢాకా, చిట్టగాంగ్‌లలో ప్రకంపనలు వచ్చాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బ్యాంకాక్ సబర్బన్ ప్రాంతాల్లో 1.7 కోట్ల మంది నివసిస్తున్నారు. పర్యాటక ప్రాంతమైన బ్యాంకాక్‌లో ప్రజలంతా షాపింగ్ మాల్‌లు ఖాళీ చేసి నగరం మధ్యలో ఉన్న పార్క్‌లో పోగయ్యారు. భారతీయ పర్యాటకులు పెద్ద ఎత్తున ఉండే నగరం కావడంతో ప్రస్తుతం అక్కడే ఉన్న పర్యాటకుల బంధువులు ఆందోళనలో మునిగిపోయారు. యోగక్షేమాల కోసం ఫోన్లు ఎక్కువ కావడంతో నెట్‌వర్క్‌లు స్తంభించిపోయాయి. భారత ప్రభుత్వం భారతీయ పర్యాటకుల కోసం ०66618819218 హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసింది. నైరుతి చైనాలోని యునాన్ రాష్ట్రంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చైనా ప్రభుత్వం ప్రకటించింది. ప్రకంపనల భయానికి జనం ఇళ్లలోకి వెళ్లడం లేదు. మయన్మార్ సరిహద్దులోని చైనా పట్టణం జిన్హోంగ్‌లో భూమి ఒక నిమిషం పాటు కంపించిందని స్థానిక అధికారులు తెలిపారు. మయన్మార్, థాయ్‌లాండ్‌లకు కావాల్సిన మందులను పంపిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. 2004 సునామీ భూకంపం తర్వాత థాయ్‌లాండ్‌లో భూకంపాలను ఎదుర్కోవడానికి అన్ని రకాల వ్యవస్థలను సిద్ధం చేశారు. దాంతో ప్రాణనష్టం తక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.



## అత్యంత శక్తిమంతమైన భారతీయుల జాబితాలో రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి..)

సీఎం రేవంత్‌రెడ్డికి ఈ గుర్తింపు లభించింది. తనదైన దూకుడుతో దేశ రాజకీయాల్లో చూపుతున్న ప్రభావం, నాయకత్వ లక్షణాల తో ఆయన ర్యాంకు ఈ సారి బాగా మెరుగుపడింది. ప్రాంతీయ అవసరాలను జాతీయ ప్రాధాన్యాలతో సమన్వయం చేయగలిగిన మేధో సంపత్తి, వ్యూహాత్మక దృక్పథం రేవంత్‌ను కీలక నాయకునిగా నిలిపేలా చేశాయి. ఇక ఈ జాబితాలో ఏపీ సీఎం చంద్రబాబు 14 స్థానంలో నిలిచారు. ఆయనకు ఈ ఏడాది కొత్తగా జాబితాలో చోటు దక్కడం గమనార్హం. ఈ సారి సినీ నటుడు అల్లు అర్జున్‌కూ చోటు దక్కింది. ఆయన 92వ స్థానంలో నిలిచారు.

విధానపరమైన నిర్ణయాలతో..

రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణ మాఫీ చేయడం, ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడం, మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రో ల్ బంకులు, ప్రీమియం రిటైల్ స్టోర్ల వంటి వ్యాపార అవకాశాలను కల్పించడం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, ట్రాఫిక్ విభాగంలో ట్రాన్స్‌జెండర్ల నియామకం వంటి అనేక నిర్ణయాలు రేవంత్‌రెడ్డికి ఆదరణ పెరగడానికి కారణమయ్యాయి. కాగా, పారదర్శకమైన పాలన, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడినందునే అత్యంత శక్తిమంతుల జాబితా-2025లో సీఎం రేవంత్ 28వ స్థానంలో నిలిచారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ అన్నారు. ఈ గుర్తింపు తెలంగాణ ప్రజల పట్ల ముఖ్యమంత్రి బాధ్యతను మరింత పెంచినట్లయిందని పేర్కొన్నారు.

## పరువు హత్య

(మొదటి పేజీ తరువాయి..)

పెద్దపల్లి, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 28:

తన కూతురును మరిచిపోవాలంటూ ఆ యువకుడిని హెచ్చరించినా పట్టించుకోకపోవడంతో అతడిపై యువతి తండ్రి కక్ష కట్టాడు. వేరే కులం యువకుడితో ప్రేమాగీమా వద్దంటూ మందలించినా కూతురు పట్టించుకోకపోగా ఆ అబ్బాయికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పడంతో ఉన్మాదిగా మారాడు. ఆ యువకుడిని చంపేస్తే తప్ప కూతురు ప్రేమ వ్యవహారానికి ఫుల్‌స్టాప్ పడదని భావించి.. పథకం ప్రకారం అతడి ప్రాణాలను బలిగొన్నాడు. గొడ్డలితో దాడి చేస్తే తీవ్రగాయాలతో రక్తమోడుతున్న స్థితిలో ఆ యువకుడు హాహాకారాలు పరుగులు పెట్టినా.. కనికరించకుండా వెంబడించి మరీ పదే పదే నరికి చంపాడు. ఈ కులోన్మాద హత్య పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో జరిగింది. హతుడు ఆ గ్రామానికి చెందిన పూరేళ్ల పరశురాములు గౌడ్, జ్యోత్స్న దంపతుల కుమారుడు సాయి కుమార్ గౌడ్ (18). కూతురు నాలుగేళ్ల క్రితం డెంగీతో మృతిచెందడం, మిగిలిన ఒక్కగానొక్క సంతానం తాజాగా హత్యకు గురవడంతో ఆ తల్లిదండ్రులు కంటికీమంటికి ధారగా రోదిస్తున్నారు. సాయి కుమార్ ఇంటర్ చదువును మధ్యలోనే ఆపేశాడు. అదే గ్రామంలోని ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన తన సహధ్యాయి, సుల్తానాబాద్‌లో ఇంటర్ చదువుతున్న 18 ఏళ్ల యువతిని రెండేళ్లుగా ప్రేమిస్తున్నాడు. ఇది తెలిసి యువతి తండ్రి ముత్యం సదయ్య అలియాస్ సది, సాయికుమార్‌ను పలుమార్లు మందలించినట్లు తెలుస్తోంది.

## విషాదం

(మొదటి పేజీ తరువాయి..)

ఇంట్లోనే భోజనం చేశారు. చెన్నయ్య అన్నం, పప్పు తిన్నాడు. భార్య, ముగ్గురు పిల్లలు పెరుగన్నం తిన్నారు. భోజనం తర్వాత చెన్నయ్య ట్యాంకర్ నడిపేందుకు చందానగర్ వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చాడు. రజిత తలుపులు తెరవగా.. పిల్లలు నిద్రపోతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రజితకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో స్థానికుల సహాయంతో చెన్నయ్య ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. ఆ తర్వాత పిల్లలను పరిశీలించగా.. అప్పటికే ముగ్గురూ మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెన్నయ్యది రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెడకపల్లి. ఉపాధి కోసం గత కొంతకాలంగా ఆయన అమీన్‌పూర్‌లో ఉంటున్నాడు. చిన్నారుల మృతిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పొట్టకూటి కోసం వచ్చిన ఇద్దరు వలస కార్మికులు బావిలో పడిపోయి చనిపోయారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు మృతి చెందిన ఇద్దరు యూపీ, ఒడిశాకు చెందిన బైద్యనాథ్ భట్ (25), హరిసింగ్ మజ్ హీ(30)గా గుర్తించారు. పైడిగుమ్మల్ లో వెంచర్ పనులకు వచ్చి ఇద్దరు కార్మికులు మార్చి 10న అదృశ్యమైనట్లు చెప్పారు. మార్చి 13న కోహీర్ పోలీస్ స్టేషన్‌లో అదృశ్యంపై ఫిర్యాదు వచ్చినట్టు చెప్పారు. పైడిగుమ్మల్ గ్రామానికి వచ్చి తిరిగి పని ప్రదేశానికి వెళ్తూ దారితప్పి బావిలో పడిపోయినట్లు పోలీసుల అనుమానిస్తున్నారు. మార్చి 27న రాత్రి వ్యవసాయ బావిలో మృతదేహాలను గుర్తించారు పోలీసులు. మృతదేహాలను బావిలో నుంచి వెలికితీసి పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు కోహీర్ పోలీసులు.

## కేంద్ర ఉద్యోగులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి..)

మంత్రివర్గం ఆమోదించింది. ఈ పరిశ్రమ ఎంతకాలంగానో ఈ నిర్ణయం కోసం ఎదురుచూస్తోందని, ఈ ప్యాకేజీ ఆరేళ్లు అమల్లో ఉంటుందని వైష్ణవ్ చెప్పారు. బిహార్లో అత్యంత కీలకమైన కోసీ మేచీ అంతర్గత అనుసంధాన ప్రాజెక్టును కూడా కేబినెట్ ఆమోదించింది. ప్రధానమంత్రి కృషి సించయీ యోజన-సత్వర సాగునీటి లబ్ధి పథకం (ఏఐబీపీ) కింద దీనికి ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ పథకం అంచనా వ్యయం రూ.6,282.32 కోట్లు కాగా.. కేంద్రం బిహార్‌కు రూ.3,652.56 కోట్లు అందిస్తుంది. సాగునీరు, వరద నిర్వహణ కోసం ఇప్పుడున్న తూర్పు కోసి ప్రధాన కాలువను ఆధునికీకరించి.. కోసి నదిలో మిగులు జలాలను మహానంద బేసిన్‌లో సాగునీటి అవసరాలకు మళ్లించడం దీని ప్రధానోద్దేశం. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే నేపాల్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు వైష్ణవ్ వెల్లడించారు. 2029నాటికి పథకం పూర్తవుతుందని, అరారియా, పూర్ణియా, కిషన్‌గంజ్, కతిహార్ జిల్లాల్లో 2.10 లక్షల హెక్టార్లకు అదనంగా సాగునీరు అందుతుందని చెప్పారు. డీఏ బకాయిలు ఏప్రిల్ వేతనంలో! పెరిగిన డీఏ/డీఆర్ బకాయిలను ఏప్రిల్ నెల వేతనంతో కలిపి అందిస్తారు. డీఏ పెంపుతో ఉద్యోగుల వేతనాలు పెరుగనున్నాయి. ఉదాహరణకు.. రూ.18 వేల మౌలిక వేతనం కలిగిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగికి (ఈ ఏడాది జనవరి 1 నుంచి) ఇక ప్రతి నెలా రూ.360 పెరుగుతుంది. 18 వేల మౌలిక వేతనం, నెలనెలా రూ.30 వేల జీతం పొందుతున్న ఉద్యోగికి ఇక డీఏ కింద రూ.9,900 అందుతుంది.

## అర్హులందరికీ కార్డులు.. సన్నబియ్యం

### మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి

నల్లగొండ, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 28:



అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు, సన్నబియ్యం ఇస్తామన్న వాగ్దానానికి కట్టుబడి ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆ దిశగా అడుగులు వేశామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని అన్నారు. ఈ క్రమంలో ఉగాది రోజున పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పు రానుందని మంత్రి ఉత్తమ్ అన్నారు. హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పథకాన్ని మంత్రి ఉత్తమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 85 శాతం జనాభాకు సన్నబియ్యం అందనుంది. రేషన్ బియ్యాన్ని చాలామంది ఉపయోగించుకోవడం లేదు. దొడ్డు బియ్యం తినకుండా కొందరు బ్లాక్‌లో అమ్ముతున్నారు. అందుకే సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు. బియ్యంతో పాటు త్వరలోనే పప్పు, ఉప్పు లాంటి ఇతర సరకులు ఇస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఏర్పాటు చేశాం అన్నారు. కొత్త రేషన్ కార్డులు ఎంతమందికి కావాలన్నా అర్హతను బట్టి ఇస్తున్నాం. కార్డు లేకున్నా లబ్ధిదారుల జాబితాలో పేరు ఉంటే బియ్యం ఇస్తాం. రేషన్ బియ్యంపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏటా రూ.10,665 కోట్లు- ఖర్చు చేస్తున్నాయని ఉత్తమ్ తెలిపారు. ఇప్పటికే కార్డుకు అర్హుల జాబితా సిద్ధం అయ్యిందన్నారు. సిఎం రేవంత్ చేతుల మీదుగా పథకం ప్రారంభం అవుతుందని అన్నారు.

## కాంగ్రెస్ విధానాలతో కుప్పకూలిన రియల్ రంగం

### - ట్విట్టర్ వేదికగా కెటిఆర్ ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 28:

నగర అభివృద్ధి, రియల్ ఎస్టేట్ పరిస్థితి, ప్రభుత్వ పాలనపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేస్తూ, గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో నగరం సౌభాగ్యంగా ఎదిగిందని, కానీ 15 నెలల కాంగ్రెస్ పాలనలో అభాగ్యంగా మారిందని విమర్శించారు. హైదరాబాద్ నగరాభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీసిందని కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో నగరంలోని రియల్ ఎస్టేట్ మార్కెట్ పూర్తిగా కుంచించుకుపోయిందని తెలిపారు. పేదల ఇళ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేస్తున్న ప్రభుత్వం, పెద్దల ఆస్తులతో సెటిల్మెంట్లు చేస్తోందని విమర్శించారు. గత త్రైమాసికంలో హైదరాబాద్‌లో ఇండ్ల విక్రయాలు 49శాతం తగ్గాయని, ఆఫీస్ లీజింగ్ రంగం 41శాతం క్షీణించిందని గణాంకాలతో తెలిపారు. వ్యవసాయ రంగంలో మాత్రమే కాదు, రియల్ వ్యాపారుల పరిస్థితి కూడా దారుణంగా మారిందని, కాంగ్రెస్ పాలనలో వ్యాపారస్తులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని అన్నారు. కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి పరోక్షంగా హితబోధ చేశారు. కూల్చడం కంటే కట్టడాన్ని నేర్చుకోవాలని, అబద్దాల కన్నా అభివృద్ధిని ప్రోత్సహించాలని సూచించారు. 'జాగో తెలంగాణ జాగో!' అంటూ తెలంగాణ ప్రజలను అప్రమత్తం చేశారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ పరిస్థితి, హైదరాబాద్ నగరాభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై కేటీఆర్ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## ఇక టూవీలర్‌దారులకు రెండు హెల్మెట్లు

### - బండి కొనేప్పుడే అంటగట్టే ఆలోచన

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 28:

దేశంలో నిరంతరం రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు, వాహనదారుల ప్రాణాలను కాపాడేందుకు భారత ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉంది. ఈ క్రమంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు కొన్ని మార్పులను కూడా తీసుకొస్తోంది. కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కర్ కొత్త ఆలోచనతో ముందుకొచ్చారు. దీని ప్రకారం ఇకపై దేశంలో టూవీలర్లను ఖచ్చితంగా ఐఎస్ఐ సర్టిఫికేషన్ కలిగిన రెండు హెల్మెంట్లతో కలిపి విక్రయించాలని పేర్కొన్నారు. ఇదే అమలులోకి వస్తే ద్విచక్రవాహం కొనే వ్యక్తులకు బండి డెలివరీతో పాటు- రెండు హెల్మెట్లు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందిజ కేంద్ర మంత్రి గడ్కరీ ఈ విషయాన్ని దిల్లీలో జరిగిన ఆటో సమ్మిట్ కార్యక్రమంలో మాట్లాడుతూ వెల్లడించారు. ఈ ప్రతిపాదనను దేశంలోని టూవీరల్స్ హెల్మెట్ తయారీదారుల అసోసియేషన్ స్వాగతించింది.రోడ్డు ప్రమాదాలను నివారించడానికి గడ్కరీ ఆదేశం కీలకమైనదిగా తెలుస్తోంది. దేశంలో చాలా కాలంగా ఎదుర్కొంటు-న్న రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించటానికి ఇది దోహదపడే చర్యగా ఆటో రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఇదే క్రమంలో ఐఎస్ఐ నాణ్యతా ప్రమాణాలు కలిగిన హెల్మెంట్లను వాహనదారులు ఉపయోగించేలా ఇది ప్రేరేపిస్తుందని హెల్మెట్ తయారీదారుల సంఘం అభిప్రాయపడింది.

## పాలమూరు-రంగారెడ్డికి జాతీయ ప్రతిపాదన

### - తిరస్కరిస్తూ తిప్పి పంపిన కేంద్రం

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 28:

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు పంపింది. కృష్ణా నదీ జలాల వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య ప్రస్తుత వివాదం సుప్రీంకోర్టులో ఉందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్2 ఇందుకు సంబంధించిన విచారణ చేపడుతోందని కేంద్ర జలశక్తి శాఖ అధికారులు ప్రస్తావించారు. కోర్టు వివాదం నేపథ్యంలో.. ఈ ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ రిపోర్ట్‌ను పరిగణనలోకి తీసుకోవడం సాధ్యం కాదని కేంద్ర జలశక్తి శాఖ తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ప్రతిపాదనలు తెలంగాణ రాష్ట్రానికి తిరిగి పంపినట్లు లోక్‌సభలో కేంద్రం తెలిపింది. 2022 సెప్టెంబర్‌లో ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి ప్రతిపాదనలు పంపిందని కేంద్ర ప్రభుత్వం గుర్తుచేసింది. 2024 డిసెంబర్‌లో ఈ ప్రతిపాదనలు తిప్పి పంపామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు విషయంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్న అడిగారు. ఈ ప్రశ్నకు జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

## భావప్రకటనస్వేచ్ఛను గౌరవించాలి

### - అది ప్రాథమిక హక్కు కిందకే వస్తుంది

### - సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 28:


కవిత్వం, నాటకం, స్టేజీ ప్రదర్శనలు, వ్యంగ్యం మరియు కళల ద్వారా భావాన్ని స్వేచ్ఛగా వ్యక్తీకరించే ప్రాథమిక హక్కుని గౌరవించాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 'ఏ ఖూన్ కే ప్యాసె బాత్ సునో ' అనే కవితను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసినందుకు కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ ప్రతాప్‌గర్హిపై గుజరాత్ పోలీసులు నమోదు చేసిన కేసును శుక్రవారం కొట్టివేసింది. వాక్‌స్వేచ్ఛ మరియు భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడటానికి కోర్టులు ముందంజలో ఉండాలని పేర్కొంది.ఉదారవాద, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కులైన వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ, ప్రతి విమర్శ లేదా అసమ్మతిని తమ అధికారం మరియు స్థానానికి ముప్పుగా భావించే అభద్రతా భావంతో బలహీనం చేయకూడదని జస్టిస్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. వాక్ స్వాతంత్ర్యంపై సహేతుకమైన ఆంక్షలు సహేతుకంగానే ఉండాలని జస్టిస్ భుయాన్ వివరించారు. ఆంక్షలు హానికరం లేదా అణచివేతగా ఉండకూడదని, స్వేచ్ఛగా మాట్లాడే ప్రాథమిక హక్కుని ఆంక్షలు కప్పివేయలేవని జస్టిస్ భుయాన్ సూటిగా పేర్కొన్నారు. ఒక వ్యక్తి వాక్, భావ ప్రకటనా హక్కుని కాపాడటం , గౌరవించడం పోలీసుల, ప్రభుత్వాల భాధ్యత అని ధర్మాసనం ఉద్ఘాటించింది. కవిత్వం, నాటకం, సినిమాలు, రంగస్థల ప్రదర్శనలు, వ్యంగ్యం, కళలు సహా సాహిత్యం జీవితాన్ని మరింత అర్థవంతం చేస్తుందని, వ్యక్తులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను వ్యక్తీకరించే హక్కులను గౌరవించాలని జస్టిస్ ఓకా పునరుద్ఘాటించారు. ఆరోగ్యకరమైన ,నాగరిక సమాజంలో వాక్ స్వాతంత్ర్యం అంతర్భాగమని, మెజారిటీ- వ్యక్తులు అభిమానిస్తున్నారనే కారణంతో ఒక వ్యక్తి అభిప్రాయాలను అణచివేయలేమని కోర్టు వ్యాఖ్యానించింది. పోలీసులు కూడా భిన్నాభిప్రాయాలను కాపాడాలని, అవి కూడా ప్రజాస్వామ్య విధుల్లో ఒక భాగమని కోర్టు పేర్కొంది. ఆలోచనా స్వేచ్ఛ లేకుండా భావప్రకటన లేకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 హామీ ఇచ్చిన గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం అసాధ్యం అని జస్టిస్ ఓకా పేర్కొన్నారు. పోలీసులు మరియు ప్రభుత్వం వాక్ స్వాతంత్యాన్ని కాపాడటంలో విఫలమైతే కోర్టులు తప్పకుండా జోక్యం చేసుకోవాలని, పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయకుండా చూసుకోవడం కోర్టుల విధి అని పేర్కొన్నారు.కులం మతం ఆధారంగా వివిధ వర్గాల ప్రజల మధ్య శతృత్వాన్ని పెంచుతున్నారని ఆరోపిస్తూ గుజరాత్ పోలీసులు ప్రతాప్‌గర్హిపై కేసు నమోదు చేశారు. మార్చి 3 విచారణ సమయంలో ఈ కవిత అహింసను సూచిస్తుందని మహాత్మాగాంధీ స్వయంగా అనుసరించిన మార్గమని మార్చి 3న జరిగిన విచారణలో జస్టిస్ ఓకా పేర్కొన్న సంగతి తెలిసిందే.

# మళ్లీ పెరగనున్న మెట్రో చార్జీలు

### కేంద్రం అనుమతి కోరేందుకు ప్రయత్నాలు

**హైదరాబాద్, మార్చి28(నేటి ఫోకస్ న్యూస్):**

మెట్రోకు ఈ మధ్యకాలంలో నష్టాలు వస్తుండటంతో హైదరాబాద్ మెట్రో రైలు టికెట్ రేట్లు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రం అనుమతి కోరేందుకు ఎల్అండ్టీ, హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్) సంస్థ అధికారులు ప్రయత్నిస్తున్నారు. రోజుకు కోటిన్నర రూపాయల నష్టం వస్తోందని, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అంతర్జాతీయ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు ఇప్పటికీ వడ్డీలు చెల్లించలేకపోతున్నామని ఎల్అండ్టీ సంస్థ చెబుతోంది. అయితే ప్రయాణికులపై అదనపు భారం వేయొద్దనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ధరల పెంపునకు సుముఖంగా లేదని తెలుస్తోంది. నగరంలో మొదటిదశ ప్రాజెక్టును ఎల్అండ్టీ సంస్థ నిర్మించిన విషయం తెలిసిందే. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యం (పీపీపీ)లో 2012లో రూ.14,132 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించి 2017 నవంబరులో పూర్తిచేశారు. మూడు కారిడార్ల పరిధిలో ప్రయాణించే వారి సంఖ్య రోజూ 5.10 లక్షలకు చేరింది. కరోనాకు ముందు రోజుకు రూ.80 లక్షలకు పైగా ఎల్ అండ్ టీ ఆదాయం సమకూర్చుకుంది. అయితే, 2020లో కరోనా లాక్డౌన్తో మెట్రో కుదేలైంది. 2022 నుంచి క్రమంగా కోలుకున్నా నష్టాల ఊబి నుంచి బయటపడలేదని చెబుతోంది. మెట్రో నిర్వహణలో రోజుకు సుమారు రూ.కోటిన్నర వరకు నష్టం వస్తున్నట్లు ఎల్ అండ్ టీ అధికారులు తరచూ చెబుతున్నారు. ఆశించినవిధంగా ప్రయాణికుల సంఖ్య రోజుకు 6 లక్షలకు పెరగకపోవడం, నిర్వహణ ఖర్చులు పెరిగిపోవడంతో నష్టాలు




ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. టికెట్ రేట్ల సవరణ విషయంపై హెచ్ఎంఆర్ సంస్థ, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం 2022 సెప్టెంబరులో కమిటీని నియమించింది. ఆ కమిటీ ప్రజాభిప్రాయాన్ని సేకరించి నివేదిక సమర్పించింది. అదే సమయంలో 2023 జనవరి నుంచి రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం రావడంతో టికెట్ చార్జీల విషయం మరుగునపడింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా కేంద్రం అనుమతి కోరేందుకు హెచ్ఎంఆర్, ఎల్అండ్టీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మెట్రోకు మహిళా ప్రయాణికుల సంఖ్య బాగా తగ్గిందని, కనీసం టికెట్ చార్జీలు పెంచుకునే అవకాశం కల్పిస్తే కొంతైనా నష్టాలను పూడ్చుకుంటామని ఎల్అండ్టీ కోరుతోంది. అయితే మెట్రో రెండో దశ నిర్మాణంపై దృష్టి సారించిన సర్కారు ఇప్పుడు కేంద్రానికి ఈ విషయం తెలియజేస్తే... అసలు లక్ష్యం దెబ్బతినే అవకాశం ఉందని భావిస్తోంది. అంతేకాకుండా కాలుష్యరహితంగా నడిచే మెట్రో రైళ్లలో టికెట్ ధరలు అందుబాటులో ఉండాలని, పెంచితే ప్రయాణికుల సంఖ్య పడిపోతుందన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటోంది.



## శ్రీ వెంకటేశ్వర స్వామి హుండీ లెక్కింపు

**నర్సింహులపేట నేటి పోకస్ న్యూస్ ప్రతినిధి కోమిరే యాకయ్య మార్చి28**

మండల కేంద్రంలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి మూడు నెలల హుండీ లెక్కింపును, శుక్రవారం రోజున ఆలయ ఈవో వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ మార్క శేఖర్ ,పరిశీలకు రాలు సమత మహబూబాబాద్, ఆధ్వర్యంలో (మదింపు) లెక్కింపు చేశారు, హుండీ ఆదాయం, 94070/- రూపాయల ఆదాయం వచ్చిందని, ఆలయ ఈవో తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ప్రధాన అర్చకులు నందనా చార్యులు, రామాచార్యులు, క్లర్క్ విష్ణు, ఆలయ వాచ్మెన్ , కోటగిరి రాములు మొదలగు వారు పాల్గొన్నారు

## చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**



రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అథారిటీ చైర్మన్ కొత్త కాపు శివసేన రెడ్డి కుమారుడి జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. శుక్రవారం హైదరాబాద్ నగర శివారు హిమాయత్ సాగర్ లోని ఆనంద కన్వెన్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రులతో పాటు వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇతర కార్పొరేషన్ల చైర్మన్లు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. శివసేన రెడ్డి స్వగ్రామం పెద్దగూడెం గ్రామస్తులకు ఏర్పాటుచేసిన రెండు బస్సుల్లో చాలామంది తరలివెళ్లి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.



## అభివృద్ధి తెలంగాణ కాస్త.. ఆత్మహత్యల తెలంగాణగా మారింది

### 15 నెలల్లోనే రాష్ట్రం దివాలా : కేటీఆర్

**వరంగల్, మార్చి28(నేటి ఫోకస్ న్యూస్):**

నాటి బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితే... 15 నెలలకాలంలోనే రాష్ట్రం దివాలా తీసిందని మాజీమంత్రి కేటీఆర్ విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో సౌభాగ్యనగరంగా ఉన్న హైదరాబాద్ కాంగ్రెస్ ఏలుబడిలో అభాగ్యనగరంగా మారిందన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో నగరంలో ఇండ్ల కొనుగోళ్లు తగ్గాయని విమర్శించారు. అమ్మకాలు జరగకపోవడంతో రియల్టర్లు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. అన్నదాతలే కాదు అమాయక రియల్ వ్యాపారులు కూడా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. కూల్చడం కాదు కట్టడం నేర్చుకోవాలని, అబద్ధాలు చెప్పడం కాదు అభివృద్ధి చేయడం నేర్చుకోవాలని కాంగ్రెస్ పాలకులకు చురకలంటించారు. పేదల ఇండ్ల పైకి బుల్డోజర్లు, పెద్దల ఆస్తులతో సెటిల్మెంట్లు. రియల్ ధమాల్.. ఇన్ఫ్రా సజీవ సమాధి, మూసీ, హైడ్రా పేరుతో మూటలు కడుతున్న కాంగ్రెస్ గద్దలన్నారు. హైదరాబాద్లో గత త్రైమాసికంలో 49 శాతం విక్రయాలు తగ్గాయని తెలిపారు. ఇంకా కాంగ్రెస్ పాలనలో ఎన్ని దారుణాలు చూడాలోనని ఆందోళన వ్యక్తంచేశారు.

## భద్రాచలం ప్రభుత్వా దవాఖాన వద్ద ఉద్రిక్తత

### భవనం కూలిన ఘటనలో న్యాయం చేయాలని ఆందోళన

**భద్రాచలం, మార్చి28(నేటి ఫోకస్ న్యూస్):**

భవనం కుప్పకూలిన ఘటనలో శిథిలాల కిందపడి చనిపోయిన మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కుల సంఘాలు, వామపక్ష, కుల సంఘా నాయకులు, తాపీమేస్త్రి ఉపేందర్ బంధువులు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే మృతదేహాలకు పోస్టుమార్టం చేయాలని ప్రభుత్వ దవాఖాన మార్చురీ ఎదుట ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు హాస్పిటల్కు చేరుకున్నారు. వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. శ్రీపతి సేవా ట్రస్టు పేరిట భద్రాచలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఆరు అంతస్థుల భవనం బుధవారం కూలిన ఘటన విషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. శిథిలాల కింద చిక్కుకుని తాపీమేస్త్రి ఉపేందర్, కార్మికుడు కామేశ్వర్రావు మృతిచెందారు. గురువారం శిథిలాల్లో చిక్కుకుపోయిన తాపీమేస్త్రి కామేశ్వర్రావును అధికారులు ప్రాణాలతో బయటకుతీశారు. కానీ అప్పటికే కాలు, చెయ్యి నుజ్జునుజ్జయి, తీవ్ర రక్తస్రావం జరిగిన కామేశ్వర్రావు దవాఖానకు తరలించిన వెంటనే ప్రాణాలు వదిలాడు. శుక్రవారం ఉదయం ఉపేందర్ మృతదేహాన్ని శిథిలాల కిందినుంచి రెస్క్యూ సిబ్బంది వెలికి తీసింది. పోస్టుమార్టం అనంతరం ఉపేందర్ డెడ్బాడీని ఆయన కుటుంబ సభ్యులకు అందజేయనున్నారు.

## కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల్లో అశాంతి

### అబద్ధాలతో పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్

### పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని : ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్, మార్చి28(నేటి ఫోకస్ న్యూస్):**

కాంగ్రెస్ పాలనలో ప్రజలు అశాంతిగా ఉన్నారని, ఈ పాలన ఎప్పుడు ఆగిపోతుందోనని ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. శాసనమండలిలో ఇవాళ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీల విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. అప్పులపై కాంగ్రెస్ నేతల తప్పులు బయటపడ్డాయని అన్నారు. రాష్ట్రం అప్పులు మొత్తం రూ.4.42 లక్షలుగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.8 లక్షల కోట్లు అప్పులున్నాయని దష్ప్రచారం చేస్తున్నారని కవిత విమర్శించారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా నిజాలు చెప్పాలని అన్నారు. అబద్దాలు చెబుతున్నామని కాంగ్రెస్ పార్టీ ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందని సూచించారు. ప్రజలు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల సమస్యలపై గళమెత్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతి రోజూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపామని గుర్తుచేశారు. కేసీఆర్పై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా సభలో నిరసన తెలిపామని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్పై తాము చేసిన పోరాటానికి ప్రభుత్వం దిగొచ్చిందని, ఎప్పటికప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేస్తామని మండలి సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారని చెప్పారు. ప్రకటించిన విధంగా సీఎం ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేసేవరకు తాము ప్రశ్నిస్తూనే ఉంటామని కవిత అన్నారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోతాయన్నదానిలో వాస్తవం లేదని, స్వయంగా ఇరిగేషన్ మంత్రి మండలిలో ఈ విషయం చెప్పారని అన్నారు. 'నీళ్లు ఇవ్వగలిగి ఇవ్వకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కాదా..?' అని



కవిత ప్రశ్నించారు. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని చెప్పారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తి వద్ద బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ జరుగుతుందని ఆమె తెలిపారు. మహాకుంభమేళా తరహాలో సభను నిర్వహిస్తామని అన్నారు. ఇరవై ఐదు వసంతాల బీఆర్ఎస్ పార్టీ ఉత్సవాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కవిత పిలుపునిచ్చారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ప్రజల గొంతుకగా వ్యవహరించిందని అన్నారు. సమన్వయంతో అన్ని అవకాశాలను వాడుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నించామని, అన్ని చర్చల్లో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టామని కవిత చెప్పారు. ఈ మండలి సమావేశాలు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతాయని, ఈ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందాయని తెలిపారు. ఆ బిల్లుల ఆమోదానికి బీఆర్ఎస్ పార్టీ కృషి ఫలితం ఎంతో ఉందన్నారు. అసెంబ్లీ సాక్షిగా మహిళలను ఉద్దేశించి పరుష పదజాలంతో ముఖ్యమంత్రి అసభ్యంగా మాట్లాడారని, ఆ వ్యాఖ్యలు ఆయన చరిత్రలో మరకగా ఉండిపోతాయని అన్నారు.

## హన్మకొండలో టాటూగ్యాంగ్ హల్చల్



### భారీ దోపిడీకి పక్కా స్కేచ్.. ఓ ఇంట్లో భారీ దోపిడీ

### సీసీ కెమెరాల ఆధారంగా పోలీసుల దర్యాప్తు

### అంతర్రాష్ట్ర ముఠా పనేనని అనుమానాలు

**వరంగల్, మార్చి28(నేటి ఫోకస్ న్యూస్):**

వరంగల్లో "టాటూ గ్యాంగ్".. భారీ దోపిడీలకు పక్కా ప్లాన్తో రంగంలోకి దిగిన ఈ ముఠా టార్గెట్ చేసింది.. విశాలంగా ఉంటే ధనవంతుల ఇళ్లను టార్గెట్ చేసి లూటీలకు బరితెగిస్తోంది.. తాజాగా హనుమకొండ పరిధిలోని ఓ ఇంట్లో భారీదోపిడీకి ప్రయత్నం చేశారు.. అదృష్టవశాత్తు ఆ ఇంట్లో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.. సీసీ కెమెరా ఫుటేజ్ చూసి షేక్ అయిన పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యారణ్యపురిలో జరిగిన రాబరీ నగరమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది..సీసీ కెమెరా ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు ఒక్కసారిగా షాక్ అయ్యారు.. ఈ దోపిడికి పాల్పడిన ముఠా మామూలు దొంగలు కాదని కరడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా అని గుర్తించారు.. మొత్తం ఆరుగురు వ్యక్తులు ముసుగులు ధరించి దోపిడీలకు పాల్పడ్డారు.. వాళ్ళ ఒంటిపై ప్రతి ఒక్కరి ఎడమ చేతిపై పచ్చబొట్టు, చేతిలో మారణాయుధాలు కలిగి ఉండడం చూసి ఇదేదో డిఫరెంట్ డేంజర్ గ్యాంగ్గా భావిస్తున్నారు. విద్యారణ్యపురిలో దోపిడీకి పాల్పడిన ఈ ముఠా ఆ ఇంటి కిటికీ గ్రిల్స్ ధ్వంసంచేసి ఇంట్లోకి ప్రవేశించారు.. విలువైన వస్తువులు దొంగిలించారు.. సీసీ కెమెరాల్లో వాళ్ల దోపిడి దృశ్యాలు అంతా రికార్డయ్యాయి. అర్ధరాత్రి దోపిడికి పాల్పడిన ముఠా రెండున్నర గంటలపాటు ఆ ఇంట్లోనే గడిపినట్టుగా సీసీ కెమెరా ఫుటేజ్లో లభ్యమైన ఆధారాలను బట్టి పోలీసులు గుర్తించారు.. ఈ ముఠా ఇంట్లోకి ప్రవేశించిన సమయంలో ఆ ఇంట్లోని వారు గాఢ నిద్రలో ఉన్నారు. ఎవరు నిద్రలేచి ప్రతిఘటించకపోవడంతో అంతా ప్రాణాలతో బయటపడ్డారు.. లేకపోతే ఊహించిన విధంగా ప్రాణనష్టం జరిగి ఉండేదని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ దోపిడీ ఘటన జరిగి 24 గంటల వ్యవధిలో వాళ్ళు ఇంకా సిటీ దాటి వెళ్ళలేదని పోలీసు నిఘా వర్గాలు, టీమ్స్ గుర్తించాయి.. ఆరు ప్రత్యేక బృందాలతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.. ఈ ముఠా వరంగల్ సిటీ పరిసర ప్రాంతాల్లోనే ఎక్కడో తలదాచుకున్నారని.. కచ్చితంగా ఏదో ఒక దారుణానికి పాల్పడతారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ముందుగా అప్రమత్తమైన పోలీసులు.. నగర పరిసరాలన్నీ జల్లెడ పడుతున్నారు.. టాటూ దొంగల గురించి ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు.. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.. ఈ దొంగల గురించి ఏమైనా సమాచారం ఉంటే.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

## యువకుడిని నరకిచంపిన యువతి తండ్రి

### ప్రేమ వ్యవహారంతోనే ఘటన

**పెద్దపల్లి, మార్చి28(నేటి ఫోకస్ న్యూస్):**

పుట్టిన రోజే ఓ యువకుడిని యువతి తండ్రి గొడ్డలిలో అత్యంత దారుణంగా హత్య చేసిన సంఘటన జిల్లాలో కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరేళ్ల సాయికుమార్ గౌడ్ (17) వేరే సామాజిక వర్గానికి చెందిన యువతి ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో సాయి తన పుట్టినరోజు వేడుకలు చేసుకుంటుండగా అక్కడకు వచ్చిన యువతి తండ్రి సాయిపై గొడ్డలితో వేటు వేశాడు. మొదట సాయి మెడపై అమ్మాయి తండ్రి వేటు వేయగా.. తీవ్రంగా గాయపడిన యువకుడు అక్కడిని నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు పరిగెత్తాడు. అయినప్పటికీ అతడిని వదలలేదు. సాయి కుమార్ను కాపాడటానికి స్నేహితులు కూడా వెనకే పరిగెత్తారు. కానీ బొడ్రాయి దగ్గర మళ్లీ వరుసగా సాయిపై గొడ్డలి పోట్లు పడ్డాయి. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిని నరికిన వెంటనే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.


## సమస్యలకు చావే పరిష్కారం కాదు

### కుటుంబ పెద్దలు ఆత్మహత్యలతో కుటుంబాలు చిన్నాభిన్నం :

### మాజీ ఎమ్మెల్సీ పారుఖ్ హుస్సేన్

**హైదరాబాద్,మార్చి28(నేటి ఫోకస్ న్యూస్):**


చిన్నచిన్న విషయాలకు ఆవేశంతో ఆత్మహత్యలకు పాల్పడవద్దని, దానివల్ల వారి కుటుంబాలు అనాథాలుగా మిగులుతున్నారని మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ షాదుల్లా అనే వ్యక్తి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న పారుఖ్ హుస్సేన్ బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం ఉదయం పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. చిన్న వయసులోనే షాదుల్లా మృతి చెందడం బాధాకరమన్నారు. ఆ కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉండి వారి పిల్లలను మైనార్టీ హాస్టల్లో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పిస్తామని పేర్కొన్నారు. ఆవేశంతో యువకులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని. వారు ఆత్మహత్యలు చేసుకుంటే కుటుంబాలు అనాథలుగా మిగులుతాయని విచారం వ్యక్తం చేశారు. షాదుల్లా వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నప్పటికీ వ్యాపారంలో నష్టం రావడం, అప్పులు బాధతో ఆత్మహత్య పరిష్కారంకాదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆపద ఎక్కడ ఉంటే తాను అక్కడ ఉంటానన్నారు. పదవులు ఎప్పుడూ ఎవరికీ శాశ్వతం కాదని చెప్పారు. తనకు పదవి ఉన్నా లేకున్నా దుబ్బాక ప్రజలతో 30 ఏండ్ల అనుబంధం ఉందని తెలిపారు. తన ప్రాణం ఉన్నంతవరకు దుబ్బాక నియోజకవర్గ ప్రజలను ఎప్పుడు మరిచిపోనని ఆయన గుర్తు చేశారు. గ్రామాల్లో యువకులు మందు కల్లు తాగుడు, బెట్టింగులకు అలవాటు పడంతో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని గుర్తు చేశారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తే విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉంటే అందరూ సంతోషం వ్యక్తం చేస్తారన్నారు. ఆయన వెంట ఉమ్మడి మండల బీఆర్ఎస్ అధ్యక్షులు చింతకింది మంజూరు, సీనియర్ నాయకులు సత్తుగారి కిష్టారెడ్డి, మాజీ సర్పంచ్ కుమ్మరి శ్రీనివాస్ చారి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ యూసుఫ్, ఇసాక్, మహమ్మద్ రఫీ, గ్రామ నాయకులు బాసం నరసింహారెడ్డి, గౌరీ గారి పరుశరాములు, బంగారెడ్డి లింగారెడ్డి, నర్సిం పాల్గొన్నారు.




# గేర్ మార్చేసిన ధన్య బాలకృష్ణ



ధన్య బాలకృష్ణ.. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే.. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీల్లో ఎన్నో చిత్రాల్లో సహాయ నటిగా కనిపించింది. చాలా కాలంగా తెలుగులో కనిపించలేదు. ఇప్పుడు మరోసారి తెలుగులో సినిమా చేసి మెప్పించనుంది. ధన్య బాలకృష్ణ నటించిన బాపు సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ధన్య బాలకృష్ణ ఎక్కువగా సైడ్ రోల్స్ చేసింది. పేరుకు సైడ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించినా తన కంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది నటి ధన్య బాలకృష్ణ. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, సాఫ్ట్‌వేర్ సుధీర్ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుందీ ముందుగుమ్మ. నటన, అందంతో ఆకట్టుకుంటూ మంచి గుర్తింపు సంపాదించుకుంటుంది. వరుస అవకాశాలను సొంతం చేసుకుంటూ దూసుకెళుతోంది. తెలుగులో సాఫ్ట్ వేరు సుధీర్, నేను శైలజ, రాజు గారి గది, కార్బన్ వంటి చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. అటు వెండితెరపైనే కాకుండా డిజిటల్ ప్లాట్ ఫాంలోనూ పలు వెబ్ సిరీస్ చేస్తూ రాణిస్తోంది. అలాగే సోషల్ మీడియా లోనూ యాక్టివ్‌గా ఉంటుంది ఈ చిన్నది తాజాగా దాన్యబాలకృష్ణ ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ధన్య బాలకృష్ణ ఫోటోలపై నెటిజన్స్ రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. హీరోయిన్స్ ను మించిన అందం మీది అంటూ కుర్రాళ్ళు కామెంట్స్ చేస్తున్నారు.



# వరుస సినిమాలతో హిట్ కొడుతున్న రష్మిక మందన్న

- ఒక్కో సినిమాకు రూ.10 కోట్లు
- కారు ఖరీదే రూ. 2 కోట్లు

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా.. ప్రస్తుతం వరల్డ్ వైడ్ మారుమోగుతున్న పేరు. యానిమల్, పుష్ప 2 సినిమాతో బ్లాక్ బస్టర్స్ అందుకున్న ఈ బ్యూటీ.. ఇటీవలే ఛావా సినిమాతో మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. దీంతో గత రెండేళ్లలో మూడు పాన్ ఇండియా చిత్రాలకు ఏకంగా రూ.3 వేల కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. అంతేకాదు.. ప్రస్తుతం తెలుగుతోపాటు హిందీలోనూ వరుస సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది ఈ అమ్మడు. ఇటీవలే సికందర్ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో సల్మాన్ ఖాన్ నటించిన ఈ మూవీకి మంచి రెస్పాన్స్ వస్తుంది. ఇదిలా ఉంటే.. ఇటీవల పోర్బ్స్ నివేదిక రష్మిక సంపాదనను బయటపెట్టింది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం.. రష్మిక ఆస్తులు రూ.66 కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం. అలాగే ఒక్కో సినిమాకు దాదాపు రూ.10 కోట్ల వరకు వసూలు చేస్తుందట. ఇదిలా ఉంటే.. సాధారణంగా సినీరంగంలో హీరోహీరోయిన్స్ ఖరీదైన స్వాంకీ కార్లలో దిగడం కొందరు బాలీవుడ్ స్టార్లకు సాధ్యం అని భావిస్తాం.. తాజాగా నేషనల్ క్రష్ సైతం ఖరీదైన కారుకు ఓనర్ అయ్యింది. ఇటీవలే ఆమె మెర్సిడెస్ బెంజ్ ఎస్ 450ని కొనుగోలు చేసింది. ఈ కారు ధర దాదాపు రూ.2 కోట్లకు పైగా ఉంటుందని టాక్. నిజానికి సినీతారలకు ఆటోమొబైల్స్ పట్ల ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. చాలా మంది తారలు రోల్స్ రాయిస్, లంబోర్గినీ, మే బ్యాక్ వంటి ఖరీదైన కార్లలో సందడి చేస్తుంటారు. ఇక ఇప్పుడు రష్మిక సైతం లగ్జరీ కారులో షికారు చేస్తూ ఎక్కడా తగ్గడం లేదు. ప్రస్తుతం రష్మిక గ్యారేజీలో 5 రకాల లగ్జరీ బ్రాండ్ కార్లు ఉన్నాయి. ఈ కార్ల కోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తోంది.






# నితిన్‌కు క్షమాపణలు చెప్పిన ఆది పినిశెట్టి

టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ నటించిన తాజా చిత్రం రాబిన్ హుడ్. ఛలో, భీష్మ చిత్రాలను తెరకెక్కించిన వెంకీ కుడుముల ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఎక్స్‌ట్రార్డీనరి మ్యాన్ తర్వాత నితిన్‌తో మరోసారి జత కట్టింది శ్రీలీల. అలాగే ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాలో క్యామియో రోల్ పోషించనున్నాడు. ఇక కేతిక శర్మ స్పెషల్ సాంగ్ లో సందడి చేసింది. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న రాబిన్ హుడ్ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నితిన్ సినిమాకు ఆల్ ది బెస్ట్ చెప్పాడు మరో నటుడు ఆది పిని శెట్టి. అదే సమయంలో ఒక విషయంలో తనను క్షమించాలని నితిన్ ను కోరాడు. ఈ మేరకు ఆది పినిశెట్టి చేసిన ట్వీట్ ఇప్పుడు వైరలవుతోంది. గత నెలలో ఆది పినిశెట్టి హీరోగా నటించిన శబ్దం సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమాలో లక్ష్మీ మేనన్ హీరోయిన్‌గా నటించింది. ఆకట్టుకునే కథా, కథనాలు, విజువల్స్, బీజీఎమ్ ఇలా శబ్దం సినిమాలో చాలా పాజిటివ్ అంశాలు ఉండడంతో ఆడియెన్స్ ను బాగానే మెప్పించింది. అయితే శబ్దం సినిమా రిలీజ్ టైమ్ లో నితిన్ ఒక ట్వీట్ చేశాడు. ఆది పినిశెట్టితో పాటు శబ్దం మూవీ యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెబుతూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టాడు. అయితే తన సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉన్న ఆది పినిశెట్టి నితిన్ ట్వీట్ కు రిప్లై ఇవ్వలేక పోయాడట. ఈ క్రమంలోనే నితిన్ సినిమా రాబిన్ హుడ్ సినిమా రిలీజ్ నేపథ్యంలో ఆది పినిశెట్టి ట్వీట్ పెట్టాడు. నితిన్ కు సారీ చెబుతూ రిప్లై ఇచ్చాడు. 'ఇంత లేట్ అయినందుకు సారీ. అప్పుడు శబ్దం సినిమా రిలీజ్ టైమ్ లో ఇష్యూ ఉండడం వల్ల సరిగ్గా స్పందించలేకపోయాను. ఇంత లేటుగా రిప్లై ఇస్తున్నందుకు సారీ' అని ట్వీట్ చేశాడు. అలాగే నితన్ రాబిన్ హుడ్ సినిమా యూనిట్ కు ఆల్ ది బెస్ట్ కూడా చెప్పాడు ఆది పినిశెట్టి. ప్రస్తుతం ఈ ట్వీట్ కూడా నెట్టింట వైరలవుతోంది.

# విక్రమ్ సినిమాకు ప్రమోషన్ నిల్

## ఆశాజనకంగా లేని కలెక్షన్లు

చియాన్ విక్రమ్ తమిళ హీరో అయిన తెలుగులోను ఆయనకి విపరీతమైన ఫాలోయింగ్ ఉంది. విక్రమ్ సినిమాలని ప్రేక్షకులు ఎంతో ఆదరిస్తుంటారు. అయితే అపరిచితుడు తరువాత మళ్లీ విక్రమ్ ఆ రేంజ్ సక్సెస్ చూడలేకపోతోన్నాడు. ఇటీవల విక్రమ్ చేసిన ప్రయోగాలన్నీ కూడా విఫలం అయ్యాయి. తంగలాన్ అంటూ విచిత్ర ప్రయోగం చేసి చాలా కష్టపడ్డాడు. కాని ఆ సినిమాకి రావల్సినంత గుర్తింపు రాలేదు, మూవీ కూడా సక్సెస్ కాలేదు. అయితే తాజాగా విక్రమ్ హీరోగా అరుణ్ కుమార్ వీర ధీర శూరన్ అనే చిత్రాన్ని తెరకెక్కించారు. తెలుగులో వీర ధీర శూర అనే టైటిల్‌తో వచ్చింది. అయితే ఈ రోజు ఉదయం థియేటర్లలో విడుదల కావలసిన ఈ సినిమాకు ఢిల్లీ హైకోర్టు షాక్ ఇచ్చింది. విడుదలపై మధ్యంతర నిషేధం విధించడంతో ఉదయం 9 గంటలకు పడాల్సిన షోలు అన్నీ క్యాన్సిల్ అయ్యాయి. 'వీర ధీర శూర పార్ట్ 2' చిత్రాన్ని హెచ్.ఆర్ పిక్చర్స్ పతాకం మీద రియా శిబు ప్రొడ్యూస్ చేయగా, ఈ మూవీ రిలీజ్ మీద స్టే కోరుతూ ముంబైకు చెందిన ప్రొడక్షన్ కంపెనీ బీ4యు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. చిత్ర నిర్మాణ సంస్థ తమకు శాటిలైట్ హక్కులను విక్రయించిందని, అయితే ఒప్పందం ప్రకారం విడుదలకు ముందు సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ (ఓటిటి) హక్కులను విక్రయించకూడదు. కాని దానిని ఉల్లంఘిస్తూ నిర్మాత డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్ అమ్మేశారని తమ పిటిషన్ లో పేర్కొంది.దీంతో మూవీ రిలీజ్ మీద మధ్యంతర నిషేదం విధించింది. పివిఆర్, ఐనాక్స్ వంటి మల్టీప్లెక్స్ స్క్రీన్లలో ఉదయం 9 గంటలకు షెడ్యూల్ చేసిన షోలు అన్నిటినీ క్యాన్సిల్ చేశారు. ఓవర్సీస్‌లో షోలు కూడా పడాల్సి ఉంది.

